ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి ములుగు
ఆదివారం 20 అక్టోబరు 2024



జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా ప్రారంభం
- కాటారం మండలం మేడిపల్లి వద్ద ఏర్పాటు
- అధికారులతో రైతుల వాగ్వాదం
6

ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు వద్దు
- నినదించిన విద్యా పరిరక్షణ కమిటీ
- భూపాలపల్లిలో రౌండ్ టేబుల్ సమావేశం
6

- మెడికల్ కాలేజీకి ఆర్టీసీ బస్సుల్లో, ఆటోలో వెళ్లా..
- మెడిసిన్ చదివేటప్పుడే నజీర్‌తో ప్రేమలో పడ్డా..
- పేదలకు సేవ చేసేందుకే ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా చేరాను..
- చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి ఉండేది..
- పార్లమెంటులో అడుగుపెట్టిన రోజు మరిచిపోలేను..
- ఎంపీగా గెలవడం కన్నా.. పేదలకు మేలు చేయడమే మిన్న..
- రాజకీయాల్లో నాన్న చూపిన దారే నాకు రహదారి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో 'ఆంధ్రజ్యోతి ఇన్నర్ వ్యూ'

ఫీజు కట్టలేక స్కూల్లో నిలుచున్నా..

రాజకీయాల్లో ఉన్నా.. నాన్న కారు కూడా కొనలేదు..



7

ఇన్నర్ వ్యూ

పేరుమోసిన ప్రజాప్రతినిధి గారాల పట్టి ఆమె. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా, ఉప ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి కూతురికి ఎన్నో రాజభోగాలు ఉంటాయని సహజంగా అనుకుంటాం. కానీ ఆమె బాల్యం నుంచి వైద్యురాలి వరకు సాధారణ జీవితాన్నే గడిపింది. పాఠశాలల్లో ఫీజు కట్టలేక ఉపాధ్యాయులు నిల్చోబెట్టిన రోజులు ఆమె కళ్ల ముందు ఇంకా కదలాడుతూనే ఉన్నాయి. మెడికల్ కాలేజీకి ఆర్టీసీ బసుల్లో, ఆటోల్లో వెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. డాక్టర్‌గా లక్షలు సంపాదించుకునే మార్గం ఉన్నా.. పేదలకు వైద్యం అందించాలని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా చేరారు. ఎంతోమంది నిరుపేదలకు వైద్యం అందించి ప్రాణాలు నిలిపారు. అలాగే రాజకీయాల్లో నీతి, నిజాయితీ, విలువలకు కట్టుబడి ఉండాలని తండ్రి చెప్పిన మాటలే ఆమెకు స్ఫూర్తినిచ్చాయి. ఫలితంగా రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. తండ్రికి కొడుకులు లేని లోటు పూడ్చేందుకు రాజకీయ వారసురాలిగా అరంగేట్రం చేసి తొలి ఎన్నికల్లోనే విజయం సాధించి సత్తా చాటారు. గెలుపుకంటే ప్రజాసేవే పరమావధి అనుకుని.. వారి అభివృద్ధికి పాటు పడతానని చెబుతున్నారు వరంగల్ లోక్‌సభ సభ్యురాలు కడియం కావ్య. ఆమె జీవితంలో చోటు చేసుకున్న కొన్ని సంఘటనలను 'ఆంధ్రజ్యోతి ఇన్నర్ వ్యూ'లో పంచుకున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ

- ఐదుగురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదంలో గాయపడ్డ యువకులు

మహాముత్తారం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మండలంలోని ములుగుపల్లి-స్తంభంపల్లి గ్రామాల మధ్య శనివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... వజినెపల్లి నుంచి ములుగుపల్లి వైపు దుర్గం శివరాజం, శ్రీశైలం, అంజలి బైక్‌పై బయల్దేరారు. అదే సమయంలో ములుగుపల్లి నుంచి స్తంభంపల్లి వస్తున్న బైక్‌పై సూడిది రంజిత్, ప్రవీణ్ వస్తున్నారు. ఈ క్రమంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో శివరాజం, శ్రీశైలం, అంజలికి స్వల్ప గాయాలయ్యాయి. రంజిత్, ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. రంజిత్ పరిస్థితి విషమంగా ఉండటంతో అతడిని హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రెండు బైకులు అతివేగంగా మలుపు వద్ద అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

కాటారం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరిని డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ నాలుగు రోజుల జైలు శిక్షతోపాటు రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించారు. కాటారం ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, గూడూరు గ్రామానికి చెందిన సన్నీ ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తేలింది. వారిద్దరిని శనివారం భూపాలపల్లి జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రాంచందర్‌రావు జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. నిందితులను పరకాల సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పశువులను తరలిస్తున్న

వాహనాల పట్టివేత

- ముగ్గురిపై కేసులు నమోదు



పోలీసులు పట్టుకున్న వాహనం

ములుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను ములుగు పోలీసులు పట్టుకున్నారు. శనివారం ములుగు మండలం మల్లంపల్లి వద్ద ఎస్సై వెంకటేశ్వరావు తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో హనుమకొండ వైపు అతివేగంగా రెండు బొలేరో వాహనాలు ఆపకుండా వెళ్లాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కొంతదూరం వెంబడించి ఆ వాహనాలను అడ్డుకున్నారు. ఈ రెండు వాహనాల్లో మొత్తం 12 జీవాలను గుర్తించారు. వాటిని గోశాలకు తరలించారు. పశువులను అక్రమ రవాణా చేస్తున్న ఎమ్డీ. అన్వర్, జానపట్ల రాజ్‌కుమార్, ఎస్.కె..షకీల్‌పై కేసు నమోదుచేసి వాహనాలను స్వాధీనపర్చుకున్నట్లు ఎస్సై తెలిపారు.

- ధాన్యం సేకరణకు ప్రభుత్వ ప్రణాళిక
- ములుగు జిల్లాలో 94,235 ఎకరాల్లో వరి సాగు
- అత్యధికంగా 80,374 ఎకరాల్లో సన్నరకం
- దొడ్డు రకం 13,861 ఎకరాలు మాత్రమే..
- మొత్తం 178 కేంద్రాల ఏర్పాటుకు సిద్ధమైన అధికారులు
- ఒక్క సన్నాల కోసం 162 సెంటర్లు



సన్నాహం

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వడ్ల కొనుగోలుకు సర్కారు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇప్పటి వరకు ఉన్న ఒక లెక్క.. ఇక ఇప్పటి నుంచి మరో లెక్క. సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈసారి కాంటాల నిర్వహణ ప్రత్యేకతను సంతరించుకుంది. అధికార యంత్రాంగం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై దృష్టిసారించారు. లక్ష్యం మేర కు ధాన్యాన్ని సేకరించడంతోపాటు నిర్ణీత సమయంలో రైతులకు డబ్బులు చెల్లించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

భారీగా సన్న వడ్ల సాగు

జిల్లావ్యాప్తంగా ప్రస్తుత వానాకాలంలో 94,235 ఎకరాల్లో వరి సాగయ్యింది. సన్నవడ్లకు మద్దతు ధరకు అదనంగా క్వింటాకు రూ.500 ఇస్తామనే ప్రభుత్వ ప్రకటనకు రైతుల నుంచి విశేష స్పందన లభించింది. అత్యధికంగా 80,374 ఎకరాల్లో సన్నరకం సాగుచేశారు. దొడ్డు రకం 13,861 ఎకరాలకే పరిమితమైంది.

9 మండలాలు.. 178 కేంద్రాలు

ఈసారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను 178 ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తొమ్మిది మండలాల పరిధిలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే గోవిందావుపేటలో రెండు, ములుగు, మంగపేట, ఏటూరునాగారం మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్రారంభించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో అత్యధికంగా 113, ఐకేపీ పరిధిలో 40, జీసీసీ ద్వారా 25 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. సన్న వడ్ల కోసమే ప్రత్యేకంగా 162 కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా, 16చోట్ల దొడ్డు వడ్ల కొనుగోలు కేంద్రాలను నెలకొల్పుతారు. ప్రస్తుత సీజన్‌లో లక్షా 50వేల మెట్రిక్ టన్నుల వడ్లను సేకరించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటికే కలెక్టర్ దివాకర ఆధ్వర్యంలో అధికారులు, రైస్‌మిల్లర్లతో సమీక్షలు జరిగాయి.



ఇటీవల గోవిందరావుపేట మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

సిబ్బందికి శిక్షణ, అవగాహన

ధాన్యం సేకరణ విషయంలో పొరపాట్లు జరగకుండా సిబ్బంది అవసరమైన అవగాహన కల్పించేందుకు శిక్షణ శిబిరాలను నిర్వంచనున్నారు. ఈనెలాఖరులోగా మండలాల వారీగా కార్యక్రమాలు జరగనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆయా ప్రాంతాలతో పోల్చుకుంటే ములుగు జిల్లాలో వరి కోతలు 15 నుంచి 30 రోజులు ఆలస్యంగా జరుగుతాయి. ఇందుకు అనుగుణంగా అధికారులు దశలవారీగా కేంద్రాలను తెరవనున్నారు. ఎక్కడెక్కడ అధిక విస్తీర్ణంలో వరి సాగయ్యింది.. సన్నాల సాగు వివరాలను సేకరించి రైతులకు అందుబాటులోనే అవసరమైనన్ని? అనే అంశాలను పరిశీలిస్తున్నారు. కేంద్రాలను తెరిచేలా చర్యలు చేపడుతున్నారు.

మద్దతు ధర, బోనస్ వేర్వేరుగా..

సన్నరకం ధాన్యానికి క్వింటా రూ.2,320, దొడ్డు రకానికి రూ.2,300గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. అయితే సన్నాలకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించనుంది. కాంటా పూర్తయిన 48 గంటల నుంచి మూడు రోజుల వ్యవధిలో నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా ప్రణాళిక రూపొందించారు. అయితే.. మద్దతు ధర, బోనస్ మొత్తాలను నిర్ణీత సమయంలోనే వేర్వేరు జమ చేయనున్నారు.

ధాన్యం సేకరణకు సన్నద్ధమవుతున్నాం

- రాంపతి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతంగా జరిపించేందుకు సన్నధ్ధమవుతున్నాం. ఇప్పటికే అధికారులు, రైస్‌మిల్లర్లతో సమావేశాలు జరిపాం. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాం. సిబ్బందికి అవగాహన కల్పిస్తాం.

టూరిజం హబ్‌గా భూపాలపల్లి

- పర్యాటకంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గణపసముద్రం వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, టూరిజం అధికారులు

గణపురం/రేగొండ/చిట్యాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి నియోజకవరాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్ది, పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రాష్ట్ర టూరిజం సీఈ వెంకటరమణతో కలిసి ఆయన గణపురం మండలంలోని గణపసముద్రం, రేగొండ మండలంలోని పాండవులగుట్టలు, కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, చిట్యాల మండంలోని నైన్‌పాక శివారు నాపాక శ్రీ సర్వతోభద్ర ఆలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. గణపసముద్రాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కోటంచ ఆలయాభివృద్ధికి ప్రభుత్వం రూ. 12 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. రూ. 50లక్షలతో పాండవుల గుట్టల పైకి వెళ్లే మెట్లకు రెయిలింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. అపూర్వ చరిత్ర గల నాపాక ఆలయం పునరుద్ధరణ, అభివృద్ధి కోసం సంబంధిత శాఖలకు ప్రతిపాదనలు పంపించామన్నారు. దీనిపై టూరిజంశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావతో ప్రత్యేకంగా చర్చించినట్లు చెప్పారు. త్వరలోనే ఆలయం ఆవరణలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. ఆయన వెంట టూరిజం జీఎం ఉపేందర్‌రెడ్డి, డీఈ ధన్‌రాజ్, కన్సల్టెంట్ కిషోర్, రేగొండ తహసీల్దార్ శ్వేతారావు, కాంగ్రెస్ నాయకులు ఎన్. సంపత్‌రావు, పున్నం రవి, పబ్బా శ్రీనివాస్, చిట్యాల ఏఎంసీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, తహసీల్దార్ హేమ, ఎంపీడీవో రామకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, నేతలు శంకర్‌గౌడ్, నక్క భాస్కర్, యాదడ్ల రాజయ్య, దేవేందర్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రచ్ సెంటర్ల ప్రారంభాన్ని నిలిపివేయాలని ధర్నా - 8

అట్రాసిటీ కేసులపై సత్వరంగా స్పందించాలి

- అలసత్వం వహించకుండా పరిష్కరించాలి
- ఎస్సీ, ఎస్టీల ఆవాసాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి
- సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పడితే చర్యలు
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అట్రాసిటీ కేసులపై అధికారులు సత్వరమే స్పందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లాలో ఆయన శనివారం పర్యటించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతోపాటు అధికారులతో సమావేశ మయ్యారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, భూసమస్యలు, సర్వీస్ అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను కలెక్టర్, ఎస్పీ వారం రోజుల్లో క్లియర్ చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల్లో అన్ని సమస్యలు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. అట్రాసిటీ కేసులపై అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి మూడు నెలలకోసారి తప్పక విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతి నెలా చివరి వారంలో పౌర హక్కుల దినోత్సవాన్ని చేపట్టాలన్నారు. భూపాలపల్లి మునిసిపల్ పరిధిలో ఎస్సీల ఇళ్లు కూల్చారని కమిషన్ దృష్టికి వచ్చిందని, దీనిపై నివేదిక అందించాలని కలెక్టర్‌కు సూచించారు. భూ సమస్యలున్న మండలాల్లో గ్రామసభలు నిర్వహించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు మంజూరైన యూనిట్లకు సబ్సిడీని విడుదల చేయాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా పారదర్శకతను పాటించాలన్నారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, నీలాదేవి, ప్రవీణ్, డీఎఫ్వో వసంత, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామప్ప అద్భుత కళా సంపద

అమెరికా శాస్త్రవేత్త ఆండీ

వెంకటాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రామప్ప శిల్పకళా సంపద అద్భుతమని అమెరికా శాస్త్రవేత్త ఆండీ కొనియాడారు. మండలంలోని పాలంపేటలో కాకతీయ హెరిటేజ్ వలంటీర్ల శిక్షణ శిబిరం కొనాసగుతుండగా శనివారం ఆయన పాల్గొన్నారు. వివిధ అంశాలపై ప్రొఫెసర్ జి.ఎస్.వి.సూర్యనారాయణమూర్తి ప్రసంగించారు. ఈక్రమంలో రామప్పను సందర్శించిన పర్యాటకుడు ఆండీ శిక్షణ శిబిరం వద్దకు చేరుకుని వలంటీర్లతో మాట్లాడారు. వలంటీర్లకు ఈశిక్షణ భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వారసత్వ నిర్మాణాలు, కట్టడాలను భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ పాండురంగారావు, టూరిజం ప్రమోటర్ డాక్టర్ సూర్యకిరణ్‌తోపాటు అధికారులు ఆండ్రూస్‌కు రామప్ప చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని అందజేశారు.



ఆండీకి రామప్ప చరిత్ర పుస్తకాన్ని అందజేస్తున్న ప్రొఫెసర్లు పాండురంగారావు, సూర్యకిరణ్



టోల్‌ప్లాజాను ప్రారంభిస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ పీడీ దుర్గాప్రసాద్

జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా ప్రారంభం

కాటారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని మేడిపల్లి వద్ద జాతీయ రహదారి 353(సీ)పై ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) వరంగల్ ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, డీఈఈ కుమారస్వామి శనివారం ప్రారంభించారు. నాలుగేళ్ల క్రితం చేపట్టిన జాతీయ రహదారిపై ఎన్‌హెచ్‌ఏఐ టోల్ ప్లాజాను ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో అధికారులు టోల్ ప్లాజాను ప్రారంభించారు. నిర్వాహకులు ఫీజును వసూలు చేశారు.ఈ కార్యక్రమంలో ఏఈ ప్రమోద్‌కుమార్, పీఏస్సై రాజన్‌కుమార్, నిర్వాహణ సంస్థ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా జాతీయ రహదారి గుంతలు, గాడీలతో అధ్వానంగా ఉండగా టోల్ ప్లాజా ప్రారంభించడంపై వాహనదారులు, ప్రజలు మండిపడుతున్నారు.

అధికారులతో రైతుల వాగ్వాదం

టోల్ ప్లాజాను ప్రారంభించిన అధికారులతో రుద్రారం, బస్వాపూర్‌కు చెందిన రైతులు వాగ్వాదం చేశారు. టోల్ ప్లాజా విస్తరణ కోసం భూముల సేకరణకు తమను ఇబ్బంది పెడుతూ నోటీసులు ఇవ్వడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయల విలువైన తమ భూములను ఇవ్వబోమని తెగేసి చెప్పారు. దీంతో ఎస్సై అభినవ్ రైతులతో మాట్లాడుతూ భూసేకరణ విషయమై రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. టోల్‌ప్లాజా వద్ద ఆందోళన చేస్తే ఏమొస్తుందని నచ్చజెప్పడంతో రైతులు శాంతించారు.

మహబూబాబాద్ జిల్లాలో వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌లోని పలు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం శనివారం కురిసింది. దీంతో చిన్నపిల్లలు, పెద్దలు భయాందోళనకు గురయ్యారు. తొర్రూరు, కొత్తగూడ మండలాల్లో భారీ వర్షం కురియగా, మిగతా మండలాల్లో ఓ మోస్తరు వాన పడింది. పలు మండలాల్లో పత్తి ఏరే సమయంలో వర్షాలు కురవడంతో రైతులు నష్టపోతున్నారు. కాతపూత రాలిపోతుండడంతో తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. బలమైన గాలులు వీస్తుండడంతో వరి కోతదశలో నేలవారి ధాన్యం రాలిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా వ్యాప్తంగా ఇలా..

తొర్రూరు మండలంలో భారీ వర్షం కురిసింది. కొత్తగూడ, కేసముద్రం, నెల్లికుదురు, పెద్దవంగర, బయ్యారం, ఇనుగుర్తి, గూడూరు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురియడంతో పాటు ఉరుములు, మెరుపుల శబ్దాలతో దద్దరిల్లింది. అరగంట సేపు బీభత్సం సృష్టించింది. పెద్దవంగర మండలంలో బలమైన గాలులతో పాటు గాలి, వానకు కోతకు వచ్చిన పొలాలు నేలవాలాయి. ధాన్యం కూడా నేలరాలి నష్టం వాటిల్లింది. పెద్దవంగరలో పిడుగుపడి అనాపురం వెంకటయ్య అనే రైతుకు చెందిన సుమారు రూ. 60 వేల విలువైన పాడి గేదె మృతి చెందింది. మిగతా మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. ఉరుములు కారణంగా విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

దళితులకు బ్యాంకు రుణాలందించాలి

టీడీపీ రాష్ట్ర నాయకుడు కొండపల్లి రాంచందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం జంగిలిగొండ గ్రామ దళిత రైతులకు క్రాప్‌లోన్లు అందించాలని టీడీపీ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కొండపల్లి రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో శనివారం ఎంపీ బలరాంనాయక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ జంగిలిగొండ గ్రామంలో 2016లో దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ భూమి కొనుగోలు చేసి 11 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి మూడుఎకరాల భూమికి పాస్ పుస్తకాలు ఇచ్చారని చెప్పారు. వారికి గతంలో డీసీసీబీ నుంచి క్రాప్‌లోన్లు ఇచ్చారని, ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకంలో ఆ రుణాలు మాఫీ అయ్యాయని చెప్పారు. తిరిగి క్రాప్‌లోన్లు ఇవ్వాలని బ్యాంక్ అధికారులను సంప్రదించగా, అది ప్రభుత్వ భూమి అని రుణాలు ఇవ్వమని నిరాకరించారని తెలిపారు. స్పందించిన ఎంపీ బలరాంనాయక్ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వారికి బ్యాంకు రుణాలు అందించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రేమ్‌చంద్‌వ్యాస్, ముల్కలపల్లి చందు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటును విరమించుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యా పరిరక్షణ కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

భూపాలపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కార్పొరేట్ రంగాలకు ఊతమిచ్చే విధంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. భూపాలపల్లిలోని కొమురయ్య భవన్‌లో 'తెలంగాణ విద్యారంగం సమస్యలు- సవాళ్లు- కర్తవ్యాలు' అంశంపై భూపాలపల్లి విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా రాష్ట్ర కమిటీ కార్య నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందాలంటే కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుతో సామాన్య విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేయడమే అవుతుందన్నారు. జీవో 25ను ప్రభుత్వం సవరించాలని, ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు లింగారెడ్డి, తిరుపతి, సేవానాయక్, రమణారెడ్డి, జగపతిరావు, ప్రవీణ్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలను ఇబ్బందులు పెట్టొద్దు

- ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి
- అట్రాసిటీ, భూ సమస్యలను పరిష్కరించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ వెంకటయ్య

ములుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించొద్దని సూచించారు.

చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబునాయక్, రేణికుంట్ల ప్రవీణ్ ములుగులో శనివారం పర్యటించారు. కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ వారికి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ల్యాండ్, సర్వీస్, అట్రాసిటీ కేసులపై జిల్లా అధికారులతో శాఖల వారీగా చైర్మన్ వెంటయ్య సమీక్ష జరిపారు. దళితులు, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం మంజూరైన నిధులు, అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఎస్సీ, ఎస్టీలకు సమస్యలు ఎదురైతే కమిషన్ అక్కడికి వెళ్లి అండగా నిలబడుతోందన్నారు.పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. 15 రోజుల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను పూర్తి చేయాలని సూచించారు. పోలీసు స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రతినెలా చివరి వారంలో సివిల్ రైట్స్ డే, ప్రతి మూడు నెలలకోసారి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్, ఎస్పీ పనితీరును ప్రశంసించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్, పదోన్నతుల్లో అవకతవకలు లేకుండా చూడాలన్నారు.

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన ఎస్సీ, ఎస్టీలు నివసించే ఆవాసాలలో అభివృద్ధి పనులు చేయాలన్నారు. ప్రశ్నించకుంటే బానిసలుగా మిగిలిపోతారనే అంబేద్కర్ పిలుపును ప్రతి దళిత గిరిజనుడూ పాటించాలని, హక్కులను సాధించుకునేందుకు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. హక్కుల సంఘాల నాయకులు గ్రీవెన్స్ డేలను సద్వినియోగం చేసుకోవాలని, సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేయాలన్నారు. బడుగులు స్వేచ్ఛాయుత వాతావరణంలో బతికేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కమిషన్ చైర్మన్‌కు వినతులు సమర్పించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జిల్లా ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు లక్ష్మణ్‌నాయక్, రవీందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, ఆయా శాఖల జిల్లా అధికారులు, తహసీలార్లు, ఎంపీడీవోలు, మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మానిటరింగ్ కమిటీలో అవకాశం ఇవ్వాలి

ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీలో ఎమ్మార్పీఎస్ ఉద్యమ నాయకులకు అవకాశం కల్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు వినతిపత్రం సమర్పించారు. 30 ఏళ్లుగా దండోరా ఉద్యమంలో కొనసాగుతున్న వారికి జిల్లా కమిటీలో గుర్తింపు లేకపోవడం ఆవేదనకు గురిచేసిందని వారు పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన వెంకటయ్య అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

సంక్షిప్త వార్తలు

ఐటీఐలో ప్రవేశాలకు 30 వరకు దరఖాస్తుల పొడిగింపు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 30 వరకు పొడగించినట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి శనివారం తెలిపారు. వివిధ గ్రేడుల్లో చేరేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులై 1-8-2024 నాటికి 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులు అర్హులన్నారు. గత కౌన్సెలింగులో సీట్లురాని అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరంలేదన్నారు. పూర్తి వివరాల కోసం జ్ఞ్ః//జ్డీజ్ప్‌జ్ఞ్బ్జ్ఞ్.జౌరి.జీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు కోరుకున్న ఐటీఐ కళాశాలల్లో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

విద్యార్థినులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

మహబూబాబాద్ జిల్లా సంక్షేమాధికారి వరలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న వరలక్ష్మి

సీరోలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని జిల్లా సంక్షేమాధికారి వరలక్ష్మి అన్నారు. సీరోలు మండలం మన్నెగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో మాట్లాడుతూ.. విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కౌమారదశలో వచ్చే మార్పుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని సన్మార్గంలో నడవాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విత్తనాల సుధాకర్, ఉపాధ్యాయులు ఇందిరరాణి, శ్రీధర్, ప్రశాంతి, విక్టోరియా, లక్ష్మీనర్సయ్య, విజయకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

ఇనుగుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో శనివారం నూతనంగా కేసముద్రం మార్కెట్ చైర్మన్‌గా నియామకమైన గంట సంజీవరెడ్డిని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు.


కేసముద్రం ఏఎంసీ చైర్మన్ సంజీవరెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

క్రైం న్యూస్

పిడుగుపాటుతో మహిళా మృతి

సొమ్మసిల్లిపడిపోయిన మరో మహిళ


మృతి చెందిన మౌనిక

కేసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లి శివారు మేగ్యాతండాకు చెందిన లకావత్ మౌనిక (23) శనివారం మధ్యాహ్నం పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. తండావాసులు తెలిపిన ప్రకారం. తండాకు సమీపంలోని వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంఖానిపేట పరిధిలోని పత్తి తీసేందుకు మేగ్యతండా చెందిన పలువురు కూలీలు వెళ్లారు. మధ్యాహ్నం అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో కూలీలంతా సమీపంలోని చెట్టు వద్దకు పరిగెత్తారు. వీరిలో ముందుగా మౌనిక చెట్టు కిందకు వెళ్లడంతో అదే సమయంలో భారీశబ్దంతో చెట్టుపై పిడుగు పడింది. వెంటనే పిడుగు నుంచి వచ్చిన విద్యుదాఘాతానికి గురైన మౌనిక అక్కడికక్కడే కిందపడిపోయింది. ఆమెను వాహనంలో మహబూబాబాద్‌కు తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలపడంతో మౌనిక మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. మృతురాలికి భర్త మహేష్, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త, కుమారుడిని చూసి తండావాసులు కంటతడి పెట్టారు. ఇదిలా ఉండగా మౌనికతోపాటు మరో మహిళా కూలీ లకావత్ అనిత సొమ్మసిల్లిపడిపోయి తర్వాత తేరుకుంది. వీరి వెనుక ఐదారుగురు కూలీలు చెట్టు కిందకు వచ్చేందుకు ప్రయత్నించారు. వీరంతా కొద్దిక్షణాలు ముందుగా చెట్టుకిందకు వచ్చి ఉంటే భారీ ప్రాణనష్టం జరిగేదని తండావాసులు తెలిపారు. ఇదిలా ఉండగా నెక్కొండ, కేసముద్రం మండలాల సరిహద్దులో ఈ ఘటన చోటు చేసుకోవడంతో పోలీస్‌స్టేషన్ల పరిధి విషయంలో సందిగ్ధం నెలకొంది. దీంతో మృతదేహానికి మహబూబాబాద్‌లో పోస్టుమార్టం నిర్వహించామని, ఘటన జరిగిన ప్రాంతం నెక్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండడంతో కేసును నెక్కొండకు బదిలీ చేయనున్నట్లు కేసముద్రం ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు.

గాలి వానతో విద్యుత్ సరఫరాలో అంతరాయం

రఘునాథపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖిలాషాపూర్, మేకలగట్టు, మండేలగూడెం సబ్ స్టేషన్‌పరిధిలో గాలి వాన బీభత్సానికి విద్యుత్ స్తంభాల డిస్కులు విరిగి కిందపడ్డాయి. దీంతో ఇన్సులేటర్లు ఫెయిలై పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు శనివారం రాత్రి అంతరాయం కలిగింది. విద్యుత్ సిబ్బంది నర్మెట 132 కేవీ సబ్-స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను తీసుకుని రాత్రి వేళలో సైతం పని చేసి మూడు సబ్-స్టేషన్ల ఫీడర్ల పరిధిలోని అన్నిగ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నెల రోజుల్లో ఎనిమిది మంది మృతి

- వారంతో మంగళవారమే మృత్యువాత
- పాడుబడిన ఇంట్లో క్షుద్రపూజల ఆనవాళ్లు
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నెల రోజుల వ్యవధిలోనే ఎనిమిది మంది మృతి చెందడం, అందులో ఎక్కువ మంది మంగళ వారమే చనిపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం స్థానికులు ధైర్యం చేసి పాడుబడిన ఇంటిలోకి వెళ్లి చూడగా అక్కడ క్షుద్ర పూజల ఆనవాళ్లు కనబడడంతో ఖంగుతిన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తిరుమలనాథ స్వామి కాలనీలో ఈ వింత ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..

రఘునాథపల్లి మండలం చర్లతండాకు చెందిన గుగులోత్ రమేష్ ఏళ్ల క్రితం తిరుమలనాథ స్వామి కాలనీలో ఇల్లు కట్టుకుని జీవిస్తున్నాడు. 15 ఏళ్ల క్రితం ఇంటిని విడిచిపెట్టి స్వగ్రామం వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంట్లో ఎవరూ ఉండకపోవడంతో పాడుబడింది. ఇదిలాఉండగా, కాలనీలో ఈ నెల రోజుల వ్యవధిలో వివిధ కారణాలతో ఎనిమిది మంది మృత్యువాతపడ్డారు. అందులో ముగ్గురు ఈ ఇంటి చుట్టు పక్కల చెందిన వారే కావడంతో గ్రామస్థులు జంకుతున్నారు. ఊళ్లో మరణాలకు ఈ ఇళ్లే కారణమై ఉంటుందనే అనుమానంతో రెండు రోజులుగా కాలనీవాసులు ఏకమై ఇంటిని తెరిపించాలని నిర్ణయించారు.

ఇందులో భాగంగా 20మంది కాలనీ వాసులు శుక్రవారం సాయంత్రం పాడుబడ్డ ఇంట్లోకి వెళ్లిచూడగా క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించడంతో అవాక్కయ్యారు. భయాందోళన చెందిన వారు డయల్ 100కి ఫోన్ చేయడంతో పోలీసులు వచ్చి వారికి నచ్చచెప్పి ఇంటి యజమానిని పిలిపిస్తామని చెప్పి వెళ్లారు. కాలనీవాసులు శనివారం ఉదయం సీఐ జి. వేణును కలిసి సమస్యను వివరించగా సీఐ ఇంటి యజమానికి ఫోన్ చేసి అతడిని పిలిపించి ఇంటిని బాగు చేసి కాలనీవాసులకు భయం లేకుండా చేయాలని సూచించారు. ఇంటి యజమాని రమేష్ అక్కడికి వచ్చినా ఇంట్లోకి వెళ్లడానికి సాహసించలేదు. స్థానికంగా ఉండే కూలీలను ఆయన పిలిపించి అందులో ఉన్న క్షుద్రపూజలకు సంబంధించిన ఆనవాళ్లను తొలగింపజేశాడు. అయినా యజమాని ఇంట్లోకి వెళ్లడానికి ససేమిరా అన్నాడు. తన వదిన ఇటీవల నీటిలో దూకి ఆత్మహత్య చేసుకుందని వాపోయాడు. చేసేదేమి లేక బుధవారం కాలనీవాసులు సామూహిక వనభోజనా లకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. 20 ఏళ్ల క్రితం ఇలాంటి ఘటన జరిగిన ప్పుడు వెళ్లామని, ఇప్పుడు మళ్లీ వెళ్లాల్సి వస్తోందని కాలనీవాసులు పేర్కొన్నారు.


క్షుద్ర పూజలు జరిగిన ఇంటిని చూపుతున్న కాలనీవాసులు

ఫీజు కట్టలేక స్కూల్లో నిలుచున్నా..

- రాజకీయాల్లో ఉన్నా కారు కూడా నాన్న కొనలేదు..
- మెడిసిన్ చదివేటప్పుడే నజీర్‌తో అప్పుడే ప్రేమలో పడ్డా..
- పేదలకు సేవ చేసేందుకే ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా చేరాను..
- ఎంపీగా గెలవడం కన్నా.. పేదలకు మేలు చేయడమే మిన్న..
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో 'ఆంధ్రజ్యోతి ఇన్నర్ వ్యూ'

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)



రాష్ట్ర రాజకీయాల్లో పేరుమోసిన బడా లీడర్.. మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా పని చేసిన నేత గారాలపట్టి ఆమె. అయినా.. స్కూల్ ఫీజు కట్టలేదంటూ ఉపాధ్యాయులు నిలబెట్టిన సందర్భాలు ఉన్నాయి. మెడిసిన్ చదువు కోసం ఆర్టీసీ బస్సు, ఆటోల్లో వెళ్లిన రోజులూ ఉన్నాయి. డాక్టర్‌గా కార్పొరేట్ అస్పత్రిలో ప్రాక్టీస్ చేసి నాలుగు రాళ్లు వెనుకేసుకునే అవకాశం ఉన్నా.. సర్కారు దవాఖానలో వైద్యురాలిగా చేరింది. కొడుకులు లేరనే లోటు తండ్రికి లేకుండా చేసి రాజకీయాల్లో వారసురాలిగా అరగ్రేటంతోనే ఓరుగల్లులో విజయం సాధించి మరో రాణిరుద్రమగా గుర్తింపు పొందారు. ఆమె.. కడియం కావ్య. ఓరుగల్లు రాజకీయాల్లో కీలకంగా ఉన్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె, వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య 'ఇన్నర్ వ్యూ' ఆమె మాటల్లోనే..

ఫీజు కట్టలేదని నిలుచోపెట్టారు..

నా బాల్యం అంతకూడా హనుమకొండ టీచర్స్ కాలనీలోనే గడిచింది. ఏడో తరగతి వరకు కాకతీయ స్కూల్‌లో చదువుకున్నా. మా నాన్న కడియం శ్రీహరి రాజకీయాల్లోకి వచ్చిన రోజుల్లో నాకు, మా చెల్లికి స్కూల్ ఫీజు సకాలంలో చెల్లించేవారు కాదు. మా నోట్‌బుక్‌లో ఫీజు చెల్లించాలని ఉపాధ్యాయులు రాసి పంపించేవారు. ఒక్కోసారి అందరు పిల్ల లతో మమ్మల్ని కూడా నిల్చోపెట్టేవారు. నాన్న వద్ద డబ్బులు లేక పోవడమే ఈ సమస్య అని సర్దుకునేవాళ్లం. మా నాన్న రాజకీయాల్లో బిజీగా ఉండటంతో చాలాసార్లు మాతో గడిపే వారు కాదు. ఒక్కోసారి ఉదయం 6గంటలకు బయటకు వెళితే.. రాత్రి పొద్దుపోయాక వచ్చేవారు. అయితే ఉన్నత చదువుల విషయంలో ఆయన దృష్టిపెట్టారు. కొంత సమయం కేటాయించేవారు. నాన్న లెక్చరర్ కావటంతో వివిధ సబ్జెక్టుల్లో మా ప్రతిభను అప్పుడప్పుడు పరీక్షించేవారు. చిన్నప్పటి నుంచి నాకు డాక్టర్‌ను కావాలనే కోరిక ఉండేది. దానికి నాన్న ప్రోత్సాహం తోడవ్వటంతో డాక్టర్ అయ్యాను.

> నాన్న రాజకీయాల్లో అనుసరించిన నీతి, సేవా, ధర్మాన్నే నేనూ అనుసరిస్తున్నా. అప్పుడు ప్రభుత్వ వైద్యురాలిగా, ఇప్పుడు
>
> **ఎంపీగా వచ్చే జీతం కోసం చూస్తున్నా..**
>
> ఎంపీగా నాకు వచ్చే జీతం కోసమే ఎదురుచూస్తున్నాను. సుదీర్ఘకాలం ఎన్నో పదవుల్లో ఉన్నప్పటికీ నీతివంతమైన రాజకీయం చేయాలనేదే నాన్న నేర్పిన రాజకీయ విద్య. అదే అనుసరిస్తున్నాను.

ఆర్టీసీ బస్సుల్లో కాలేజీకి వెళ్లాను..

సుదీర్ఘకాలం నాన్న ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా పనిచేశారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా కొనసాగటంతో ప్రభుత్వ పరంగా వాహన సదుపాయం ఉండేది. దీంతో ఆయనకు ఎప్పుడూ కూడా సొంతంగా కారు కొనాలనే ఆలోచన రాలేదు. అయితే 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో నాన్నకు టికెట్ రాలేదు. ఏ పదవి లేకుండా పోయింది. స్నేహితుల కార్లు కూడా అందుబాటులో లేవు. దీంతో నాకు కాలేజీకి వెళ్లేందుకు కారు లేకుండా పోయింది. మెడిసిన్ ఫైనల్ ఇయర్ కావటంతో పంజాగుట్ట నుంచి సంతోష్ నగర్‌లోని డక్కన్ మెడికల్ కాలేజీకి ఆర్టీసీ బస్సులో చాలారోజులు ప్రయాణం చేసి కాలేజీకి వెళ్లాను. ఒక్కోసారి ఆటోలో కూడా ప్రయాణించి కాలేజీకి వెళ్లి చదువుకున్నా.

ప్రేమ గురించి నాన్నకు నేనే చెప్పా..

నేను మెడికల్ చదువుతున్నప్పుడే నజీర్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరం కలిసి మెడిసిన్ పూర్తి చేశాం. మొదట ఫ్రెండ్స్‌గానే ఉన్నప్పటికీ నజీర్ వ్యక్తిత్వం బాగా నచ్చింది. దీంతో ఒకరినొకరం పూర్తిగా అర్థం చేసుకున్నాం. జీవితంలో నన్ను బాగా చూసుకోగలడని నిశ్చయించుకున్న తరువాత పెళ్లి చేసుకోవాలని నిర్ణయానికి వచ్చాను. ఒక రోజు నా ప్రేమ గురించి నాన్నకు చెప్పాను. నజీర్‌ను ఇంటికి ఆహ్వానించి నాన్నకు పరిచయం చేశాను. నాన్నలో ఏదో ఆందోళన కనిపించింది. కులం, మతం కాని వ్యక్తితో పెళ్లి అంటే ఎట్లా అని ఆలోచించారు. నాన్నకు దగ్గరగా ఉండే ఇద్దరు స్నేహితులతో మాకు కౌన్సెలింగ్ కూడా ఇప్పించారు. చివరికి నజీర్‌తో మాట్లాడిన తరువాత నాన్నకు నమ్మకం కలిగింది. మా పెళ్లికి ఒప్పుకున్నారు. అంబేద్కర్ జయంతి రోజు ఏప్రిల్ 14న ఎంగేజ్మెంట్. ఆగస్టు 26న మా వివాహం జరిగింది. నాన్న నజీర్‌ను ఓ అల్లుడిగా కాకుండా ఓ కొడుకులాగే ప్రేమగా చూస్తారు.

సేవ కోసమే ప్రభుత్వ ఆస్పత్రిలో డ్యూటీ చేశా..

ఎంబీబీఎస్ పూర్తి అయిన తరువాత ఓ ప్రవేటు అస్పత్రిలో ట్రైనింగ్ చేశాను. ప్రైవేటు అస్పత్రిలో పనిచేస్తే డబ్బులు సంపాదించొచ్చు. కానీ, పేదలకు సేవ చేయాలనే ప్రభుత్వ అస్పత్రిలో చేరాలని అనుకున్నా. విషయం నాన్నకు చెబితే నీకు నచ్చినట్లు చెయ్.. అని సలహా ఇచ్చారు. దీంతో వర్ధన్నపేట పీహెచ్‌సీలో వైద్యురాలిగా చేరాను. సుమారు ఐదేళ్లు సేవలందించాను. కొన్ని వేల మందికి వైద్యసేవలు అందించాను. ఎంతో మందిని ప్రత్యక్షంగా కలుసుకుని వారు పడుతున్న కష్టాలను గుర్తించాను. మంచి వైద్యం కోసం ఎంజీఎంతోపాటు ఇతర ప్రభుత్వ అస్పత్రులకు పంపించాను.

చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి

చిన్నతనం నుంచి నాన్నలాగా రాజకీయాల్లోకి రావాలనే కోరిక ఉండేది. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల వరకు దగ్గరుండి చూశాను. ఓసారి జడ్పీ ఛైర్మన్ ఎన్నిక కోసం సభ్యులు తక్కువ పడితే క్యాంపు పెట్టారు. అక్కడున్నవారితో మాట్లాడితే రాజకీయాలపై కొంత అవగాహన కలిగింది. అప్పటి నుంచే పొలిటికల్ ఎంట్రీపై ఆసక్తి ఉండేది. ఈలోగా డాక్టర్‌గా ప్రభుత్వ అస్పత్రిలో కొంతమందికు సర్వీసు చేసే అవకాశం కలిగింది. దీంతో రాజకీయాల్లోకి రావాలనే ఆలోచనతో గత ఏడాది నవంబరులో వైద్యవృత్తికి రాజీనామా చేశాను.

బీఆర్ఎస్ నుంచి ఎంపీ టికెట్ ఇస్తామని అప్పటి నుంచే చెబుతూవచ్చారు. అనూహ్యంగా జరిగిన కొన్ని రాజకీయ పరిణామాల్లో పార్టీ మారాల్సి వచ్చింది. కాంగ్రెస్ నుంచి పోటీ చేసి వరంగల్ ఎంపీగా విజయం సాధించాను. పోటీ చేసిన తొలి ఎన్నికలోనే విజయం సాధించటం చాలా ఆనందంగా ఉంది. పార్లమెంట్‌లో తొలిసారి అడుగు పెట్టడం మరువరాని ఘట్టమే. పార్లమెంట్‌కు రాష్ట్రపతి వస్తుంటే ప్రధానమంత్రితో పాటు కేంద్ర మంత్రులు, ఎంపీలు స్వాగతం పలకడం వంటి వాటిని తొలిసారి చూసిన క్షణం మరువలేనివి.

> **సంక్షేమం, అభివృద్ధిపైనే ఫోకస్**
>
> ఎంపీగా గెలిచాననే సంతోషం కంటే.. పేదలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు ఏం చేయాలనే తపనే ఎక్కువగా ఉంది. కేంద్ర ప్రభుత్వం నుంచి సాధ్యమైనన్ని ఎక్కువ నిధులు తీసుకరావటంతోపాటు విద్య, వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ప్రణాళిక రుపొందిస్తున్నాను. ఐదేళ్ల కాలంలో వరంగల్‌ను సాధ్యమైనంత అభివృద్ధి చేయాలని ఆలోచిస్తున్నాను. మామూనురు ఎయిర్‌పోర్టు, స్మార్ట్ సిటీ, యూనివర్సిటీ అభివృద్ధి, భూపాలపల్లితో పాటు ఇతర ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ, ప్రభుత్వ అస్పత్రుల్లో పేదలకు మెరుగైన సౌకర్యాలు, తదితర వాటిపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాను. ప్రజలు నమ్మకంతో గెలిపించారు. అంతే నమ్మకంతో వారికి సేవల చేయాలనే దృఢసంకల్పంతో ఉన్నాను.

రాష్ట్ర విద్య కమిషన్‌లో కేయూకు చోటు

- సలహాదారులుగా ఇద్దరు కేయూ ప్రొఫెసర్ల నియామకం
- కె.వెంకటనారాయణ, మురళీమనోహర్‌కు అవకాశం



వెంకటనారాయణ, మురళీమనోహర్

కేయూ క్యాంపస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర విద్య కమిషన్ అడ్వయిజరీ కమిటీలో వరంగల్ కాకతీయ యూనివర్సిటీ నుంచి ఇద్దరు ప్రొఫెసర్లకు అవకాశం కల్పించింది. కేయూ అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్, ప్రముఖ సామాజిక వేత్త ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ, దూరవిద్య కేంద్రం మాజీ డైరెక్టర్, ప్రముఖ విద్యావేత్త కె.మురళీమనోహర్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. వర్సిటీ నుంచి తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సలహాదారులుగా ఇద్దరిని నియమించడంపై వర్సిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. వీరితో పాటు సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ జి.హరగోపాల్, కరీంనగర్ శాతవాహన వర్సిటీ ప్రొఫెసర్ సూరెపల్ల సుజాత, ఎంవీఎఫ్ నేషనల్ కన్వీనర్ పి.వెంకట్‌రెడ్డి, యూనిసెఫ్ ఎడ్యుకేషన్ స్పెషలిస్టు ఎం.శేషగిరి తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషన్ అడ్వయిజరీ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. ఎడ్యుకేషన్ కమిషన్‌కు ఛైర్మన్‌గా రిటైర్డు ఐఏఎస్ అధికారి అకునూరి మురళిని గతంలోనే రాష్ట్రప్రభుత్వం నియమించింది.

ఆర్కెస్ట్రా ఆరో ప్రాణం

- సంగీతంలో పిల్లల వైద్యుడి ప్రావీణ్యం
- విద్యార్థి దశ నుంచే గాయకుడిగా రాణింపు



డాక్టర్ శివకుమార్

వరంగల్ మెడికల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయనో సీనియర్ పిల్లల వైద్యుడు. వృత్తిలో భాగంగా చిన్నారులకు వైద్యం అందిస్తాడు. కానీ సంగీతం అంటే మహా ప్రాణం. ఆర్కెస్ట్రా అంటే ఆరో ప్రాణం.. వైద్య వృత్తిలో ఎంత బిజీగా ఉన్నా ఆర్కెస్ట్రాపై మమకారం చంపుకోలేదు. విద్యాభ్యాసం నుంచే కలలు, సంగీతంపై మమకారం పెంచుకొని ఇప్పటికీ ఆచరిస్తున్నాడు.

ఎంజీఎం ఆస్పత్రి, సీకేఎం ఆస్పత్రిలో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందాక రామన్నపేటలోని ఓ హాస్పిటల్‌లో పిల్లల వైద్యుడిగా కొనసాగుతున్న డాక్టర్ శివకుమార్ బాల్యం నుంచే కళా రంగంలో రాణించాలని పట్టుదలతో ప్రయత్నించారు. 1973లో ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడు వరంగల్ ఏబీవీ హైస్కూల్‌లో వారసత్వం, నామకరణం అనే నాటకాలలో ప్రతిభ కనబరిచారు. ఇలా ఆరంభమైన కళాపోషణ.. ఎంబీబీఎస్ విద్యాభ్యాసం వరకు కొనసాగింది. కేఎంసీలో కూడా ఏ కార్యక్రమం జరగాలన్నా ప్రార్థన గీతం ముగింపు డాక్టర్ శివకుమార్ చేయాల్సిందే. సంగీతంపై మమకారంతో డిప్లొమా పూర్తి చేశారు. ఇప్పటికీ కాకతీయ వైద్య కళాశాలలో ఏ ఉత్సవం జరగాలన్నా డాక్టర్ శివకుమార్ ఆర్కెస్ట్రాతో అలరించాల్సిందే. తన తండ్రి ఆయుర్వేద వైద్యుడైన కోటయ్య గారి దగ్గర నుంచి వారసత్వంగా కళలపై మమకారం పెంచుకున్నారు. ఇలా ఇప్పటి నుంచి మొదలై ఆరు పదుల వయస్సులో కూడా ఆర్కెస్ట్రా అంటే ప్రాణంగా జీవిస్తున్నారు. 2001లో వరంగల్ స్వర ప్యాలెస్‌లో ప్రదర్శించి పాడుతా తీయగా కార్యక్రమంలో ఉషా, సారంగపాణితో పాటలు పాడి అందరిని మెప్పించారు. పిత్రు అమావాస్య రోజున పిల్లలకు ఆరోగ్యం కోసం వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తున్నారు. అందుకే ఆయనను డాక్టర్ అయ్యగారూ.. అని కూడా రామన్నపేట వాసులు సంబోధిస్తారు. ఈ మధ్య గిరిజా కళ్యాణం సినీయలో కూడా ఓ పాత్రకు ఎంపికయ్యారు. వృత్తిలో కొనసాగుతూనే. తనకు ఇష్టమైన కళారంగంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆరోగ్య సమస్యలపై అశ్రద్ధ వద్దు

- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా
- పోలీసు సిబ్బందికి ఉచిత మెగా వైద్య శిబిరం

హనుమకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బందికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యల పట్ల అశ్రద్ధ వహించొద్దని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు చెందిన పోలీసు సిబ్బంది, హోంగార్డు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత పోలీసు ఉద్యోగులు, పోలీసు అమరవీరుల కుటుంబసభ్యుల కోసం ప్రత్యేక ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. భీమారంలోని శుభం కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి సీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్స్ శరత్ మాక్స్ విజన్ ఐ హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంపులో జనరల్ ఫిజీషియన్, కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, పల్మనాలజీ, మెడికల్ గ్యాస్ట్రో, కంటి విభాగాలకు చెందిన వైద్యనిపుణులు పోలీసు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన సిబ్బందికి డాక్టర్ల సూచనల మేరకు షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, సీఎఫ్టీఈ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సీపీ అంబర్ కిషోర్ ఝా సైతం కంటి పరీక్షలను చేయించుకున్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించుకున్న పోలీసు సిబ్బంది కేవలం పరీక్షలతో సరిపెట్టుకోకుండా డాక్టర్లు సూచించిన సలహాలను పాటిస్తూ సమయానికి మందులను తీసుకుంటూ సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలన్నారు. ముఖ్యంగా విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నప్పటికీ ఆరోగ్యం కోసం నిరంతరం వ్యాయామం, యోగా చేయడంతో పాటు దైనందిన ఆహారపు అలవాట్లలో మార్పు అవసరమని అన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉంటే శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించగలమని అన్నారు. ఈ వైద్య శిబిరంలో సహకరించిన మెడికవర్, మాక్సీ విజన్ హాస్పిటల్స్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బందికి సీపీ అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో వెస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తో పాటు ఏసీపీలు, ఆర్ఐలు, ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.



శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

పోలీసు అమరవీరుల త్యాగాలను మరువొద్దు

- సీపీ అంబర్ కిశోర్ ఝా..
- పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ

హనుమకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : శాంతి, భద్రతల పరిరరక్షణకు ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులను ప్రజలు మరువొద్దని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా తెలిపారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే) పురస్కరించుకొని శనివారం పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. సీపీతోపాటు పోలీసు అమర వీరుల కుటుంబ సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ఆశోకా జంక్షన్ నుంచి వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వద్దకు చేరుకొని అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. నక్సలైట్ల చేతుల్లో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు వృథాపోవని, వారి త్యాగాల ద్వారా నేడు ప్రశాంతవాతావరణం నెలకొందని అన్నారు. అలాగే అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ కొవ్వొత్తుల ర్యాలీలో డీసీపీ రవీందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్ కుమార్, రవితో పాటు ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, జాగృతి కళాబృందం కళాకారులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న పోలీసు అమరవీరుల కుటుంబాల మహిళలు



కేయూ వీసీగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

- అభినందనలు తెలిపిన వర్సిటీ వర్గాలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ నూతన ఉప కులపతిగా ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. కేయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వర్సిటీ పాలక మండలి సభ్యులు నూతన వీసీ ప్రతాప్‌రెడ్డిని సాదరంగా ఆహ్వానించారు. వర్సిటీ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ పుల్లూరి సుధాకర్, డాక్టర్ పి.నవీన్, డాక్టర్ సుకుమారి, డాక్టర్ చిర్ర రాజుగౌడ్, డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి, డాక్టర్ కరుకాల అనితారెడ్డి పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా నూతన ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ... అందరి సహకారంతో వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. వర్సిటీలో సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అభినందనల వెల్లువ

కేయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రతాప్‌రెడ్డికి వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నేతలు వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువాలు అందచేసి ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అకూట్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, ప్రొఫెసర్ మొలుగూరి శ్రీనివాస్, డాక్టర్ రమేశ్‌కుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఎమ్డీ ముస్తాఫా, ఎఫ్‌వో తోట రాజయ్య, టీచింగ్, నాన్ టీచింగ్ ఏఆర్ ప్రణయ్‌కుమార్, పీఆర్‌వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ నరసింహరావు, కేయూ ఎన్జీవోస్ సంఘం జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, సతీశ్‌బాబు, తోట ప్రభాకర్, ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ,డాక్టర్ పుల్లా శ్రీనివాస్, బొక్క మొగిళి, నమిండ్ల కిరణ్‌కుమార్, మంద నరేశ్, మాలవత్ తిరుపతి, సోరపాక అనిల్, సంగి శివాజీల తోపాటు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు వీసీకి అభినందనలు తెలిపారు.

ఫ్లెక్సీల మోత

కాకతీయ యూనివర్సిటీ నూతన వీసీగా ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని గతంలో ఎన్నడూలేని విధంగా పరిపాలన భవనం ఎదుట కొందరు భారీగా స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అయితే గతంలో వర్సిటీలో ఫ్లెక్సీలు కట్టి స్వాగతాలు తెలిసిన సందర్భాలు లేకపోవడంతో నూతనంగా నయాట్రెండ్ ఫ్లెక్సీలతో స్వాగతం పలకడం వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

కిట్స్‌లో ముగిసిన 'సంశోధిని-24'

హసన్‌పర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ సెమినార్ హాలులో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం సంశోధిని-24 కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి అధ్యక్షతన శనివారం ఘనంగా ముగిసింది. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, కిట్స్ స్టూడెంట్ విద్యార్థి చాప్టర్, కిట్స్ టెక్నికల్ క్లబ్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌తో పాటు 10 విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో ప్రాజెక్టు ఎక్స్‌పో, ఇన్నోవిజన్, ట్రెజర్ హంట్, 70పైచిలుకు సాంకేతిక కార్యక్రమాలతో పాటు విద్యార్థులను పరిశ్రమకు సిద్ధంగా ఉన్న ఇంజనీర్లుగా తయారు చేయడానికి, సీటీసీ ఉపాధిని సాధించడానికి ఆవిష్కరణ, ఇంక్యుబేషన్, రీసెర్చ్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. ఫెస్ట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.శ్రీలత, ప్రోగ్రాం కోకన్వీనర్ ప్రొఫెసర్ ఎం.నర్సింహారావు, ఐఎస్‌టీఈ కిట్స్ చాప్టర్ ఛైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ మధుకర్‌రెడ్డి, కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎస్.సునీల్ ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ బి.విజయ్‌కు మార్, అసోసియేట్ ప్రొఫెసర్, పీఆర్‌వో డాక్టర్ డి.ప్రభాకరాచారి పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు



వరంగల్-హైదరాబాద్ ప్రధాన రహదారి రాంపూర్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు

ఓరుగల్లుకు స్మార్ట్ 'స్వాగతం'



వరంగల్ - ఖమ్మం ప్రధాన రహదారి బొల్లికుంట వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు

ఓరుగల్లు అంటేనే కళలు, చారిత్రక కట్టడాలకు నిలయం. నిత్యం నలుదిక్కుల నుంచి వేలాది మంది వివిధ పనులు, ఉద్యోగ నిర్వహణకు వచ్చిపోతుంటారు. చారిత్రక ఓరుగల్లులోకి వచ్చేవారిని ఆహ్వానించేందుకు నలుదిక్కులా భారీ స్వాగత తోరణాలు ఆధికారులు. ఏర్పాటు చేస్తున్నారు. స్మార్ట్ సిటీ నిధులతో ఏర్పాటు చేసిన ఈ తోరణాల నిర్మాణం పూర్తయితే నగరానికి ప్రత్యేక ఆకర్షణ రానుంది.

– ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



వరంగల్ - నర్సంపేట ప్రధాన రహదారిపై కమ్ముకున్న పొగమంచు

పరుచుకున్న మంచు తెరల పరదా



తెలతెలవారుతుండగా మంచుతెరలు కమ్ముకుంటున్నాయి. శీతాకాలం ప్రారంభంలోనే రహదారులను మంచు ఆవహిస్తోంది. మంచు బిందువుల జల్లుల్లో వ్యవసాయ పనులకు, ఇతర పనులకు వెళ్లేవారు తడిసి ముద్దవుతున్నారు. వరంగల్ - నర్సంపేట రహదారిని శనివారం మంచు దుప్పటి కప్పేసింది. వివిధ పనులకు వెళ్లే వాహనదారులు, పాదాచారులు మంచులోనే ప్రయాణించారు.

– ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

టోల్ ప్లాజా వద్ద
ఫీజు వసూలు చేయొద్దు
కలెక్టర్‌కు బీఆర్ఎస్ నేతల వినతి

కాటారం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): టోల్ ప్లాజా వద్ద ఫీజు వసూలును వెంటనే నిలిపేయాలని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మకు శనివారం వినతి పత్రం అందించారు. జాతీయ రహదారిపై పలు చోట్ల గుంతలు, గాడీలతో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు గాయాలపాలై వ్యయప్రయాసల పాలవుతున్నా పట్టించుకోకుండా టోల్ ఫీజు వసూలు చేయడం దారుణమన్నారు. ఈ ప్రాంత ప్రజలకు, వాహనదారులకు నష్టదాయకంగా ఉన్న టోల్ చార్జీలను వసూలు చేయకుండా చర్యలు తీసుకో వాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జక్కు శ్రావణ్, రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

క్రచ్ సెంటర్ల ప్రారంభాన్ని నిలిపివేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అంగన్‌వాడీ సెంట ర్లలో కొత్తగా ప్రారంభించనున్న క్రచ్ సెంటర్ల ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అంగన్ వాడీలు రెండో రోజు శనివారం కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయ లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్ వాడీ సెంటర్లలో క్రష్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అంగన్ వాడీ సెంటర్ల ద్వారా మూడేళ్ల లోపు పిల్లలకు టీహెచ్ ఆర్ ఇస్తున్నారని, మళ్లీ కొత్తగా క్రచ్ ద్వారా బాలల సంరక్షణ పేరుతో కొత్త సెంటర్లను ప్రారం భించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. క్రచ్ సెంటర్లను ఎన్‌జీ వోలకు ఇచ్చే ప్రయత్నం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, నాయకులు ఎమ్డి.గఫూర్, అంగన్‌వాడీ యూని యన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సరోజన, సమ్మక్క, అంగన్‌వాడీలు జమునారాణి, రమాదేవి, ధనలక్ష్మీ, సూర మ్మ, సరిత, నర్సమ్మ, రేణుక, పుష్ప, ఇందిర, రాంబాయి, దీప పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

వెంకటాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి వినయ్ అన్నారు. శనివారం మండలంలోని వీరభ ద్రవ రం, పాత్రా పురం, నూగూరు, మరికాల గ్రామాల్లో వేర్వేరుగా వైద్యశి బిరాలు జరగగా ఆయన పాల్గొని ప్రజలకు వైద్యప రీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. ఈశిబిరాల్లో వైద్యులు పవన్, స్నేహ, సోహెల్, సిబ్బంది జ్యోతి, సత్యానా రాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ కోర్టులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమించాలి

వెంకటాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ కోర్టులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమించాలని ఆది వాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఉయిక శంకర్ శని వారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏటూరు నాగారం ఐటీడీఏలో ఏజెన్సీ ఎస్‌ఈసీ నిర్వహించ కపోవడంతో ప్రభుత్వ భూములు అన్యాక్రాంత మవుతు న్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. అదేవిధంగా ఏజెన్సీలో గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ముందుకు సాగేదెప్పుడు?!

- కాళేశ్వర క్షేత్ర అభివృద్ధి కలేనా? • అధికారుల నిర్లక్ష్యం • పూర్తి కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు


నిరుపయోగంగా ఉన్న కాళేశ్వర ఆలయ వసతి గదులు

మహదేవపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉంది. పనులు ముందుకు సాగక ఎదురుచూపులే మిగులుతున్నాయి. 2016లో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ముఖ్య మంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేయగా ప్రాజెక్టు పూర్తయింది. ఆ సమయంలోనే కాళేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.25 కోట్లను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. పనులను ప్రారంభించి ఎనిమిదేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కావడం లేదు. 100 గదుల సత్రం, అన్నదాన సత్రంతో పాటు పలు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇటీవల కాళేశ్వర క్షేత్ర అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి పెట్టడంతో కాళేశ్వర క్షేత్ర అభివృద్ధిపై ముందడుగు పడింది.ఈ క్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హను మంతు కాళేశ్వర క్షేత్రాన్ని సందర్శించి ఈ క్షేత్రం అభివృ ద్ధిపై సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో గతంలో మొదలు పెట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అయినా అధికారుల్లో ఎలాంటి కదలిక లేదు. దీంతో భక్తుల కు ఇబ్బందులు తప్పడం లేదు. ఆలయానికి వచ్చే భక్తులు బస చేయడానికి వసతి ఇక్కడ లేదు. దీంతో ఆలయం ఆరుబయట భక్తులు బస చేస్తున్నారు. అభివృద్ధి పనులు పూర్తికాకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పనులు వేగంగా అయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


నిర్మాణ దశలోనే ఉన్న అన్న అన్నసత్రం

ఫిబ్రవరిలోగా పూర్తి చేస్తాం
- సాయిలు, పంచాయతీరాజ్ డీఈ

భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ఆధ్వర్యంలో ఇటీవల సమావేశం జరిగింది. పలు పనుల ప్రగతిపై మాట్లాడారు. మూడు నెలల లోపు పనులు పూర్తి చేసి ఆలయానికి అప్పగిస్తామని చెప్పారు. మా శాఖ తరఫున కాళేశ్వర క్షేత్ర అభివృద్ధి పనులకు సంబంధించి పనులు శివరాత్రి వరకు పూర్తి చేస్తాం.

పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా..
ఎమ్మెల్యే సత్యనారాయణరావు

- రూ.2.60 కోట్ల పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9, 10వ వార్డులో రూ.2.60 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శనివారం శంకుస్థాపనలు చేశారు. మహ బూబ్‌పల్లి, గండ్రపల్లి, పుల్లూరిరామయ్యపల్లిలో బీటీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీ పనులు చేయనున్నట్లు తెలిపారు. కాంట్రా క్టర్లు నాణ్యతాప్రమాణాలు పాటించి సకాలంలో ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

రేపటి నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు సోమ వారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఎస్పీ కిరణ్ ఖరే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 31 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసులను స్మరించుకొనేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పోలీసుల విధులు, టెక్నాలజీ వినియెగం, రక్తదాన శిబిరాలు, ఓపెన్ హౌజ్, అమరవీరుల కుటుంబాల సందర్శన, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, కొవ్వొత్తుల ప్రదర్శన, సైకిల్ ర్యాలీ తదితర కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

వ్యాస రచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ముగ్గురికి బహుమతులు అందించి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. అలాగే పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించు కుంటూ బహిరంగ ప్రదేశాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

అదనపు షెడ్ల పనుల్లో వేగం పెంచాలి
ములుగు కలెక్టర్ దివాకర


జంగాలపల్లిలో అదనపు షెడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని జంగాపల్లి, మల్లంపల్లి మార్కెట్‌లలో అదనంగా చేపడుతున్న షెడ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు శనివారం ఆయన అధికారులతో కలిసి జంగాలపల్లి, మల్లంపల్లిలో చేపడుతున్న షెడ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్లపై పేదవారు చిన్నచిన్న టెంట్లు వేసుకుని వ్యాపారం చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, వారికి ఇబ్బందులు కలుగకుండా అదనంగా షెడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. షెడ్ల ప్రాంతంలో వర్షపునీరు నిల్వ ఉండకుండా ఇంకుడుగుంతలు నిర్మించాలని, చుట్టూ స్టెంచ్ కొట్టించాలని అధికారులను ఆదేశించారు. ఎంబీ రికార్డు ప్రకారమే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని, పనుల్లో నాణ్యతాలోపం ఉంటే బిల్లుల్లో కోత విధించడ జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఏపీవో రాజు, జేఈ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ సతీష్, పంచాయతీ సెక్రటరీ రాజు, తదితరులు ఉన్నారు.

ఓవర్ లోడుతో వెళ్తున్న లారీల పట్టివేత

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పరిమితికి మించి అధిక మోతాదుతో ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలను శనివారం రాత్రి పట్టుకున్నట్లు మహదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ సమీపంలో వాహన తనిఖీలు చేపడుతుండగా పంకెన, పెద్దంపేట క్వారీల నుంచి వస్తున్న ఇసుక లారీలను తనిఖీ చేసినట్లు చెప్పారు. అనుమానం వచ్చి వేబిల్లులు పరిశీలించి కుదురుపల్లి వద్ద బరువును తనిఖీ చేయగా పరిమితికి మించి ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. దీంతో మూడు లారీలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పరిమితికి మించి లారీల్లో ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలుంటాయని ఈసందర్భంగా ఎస్సై హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఈ క్వారీల నుంచి లారీలు నిత్యం ఓవర్‌లోడ్‌తో వెళ్తూ ఏదో ఓచోట పట్టుబడుతున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం అసలు అదనపు బకెట్ దందా జరగడం లేదని చెబుతుండటంపై విస్మయం వ్యక్తమవుతోంది.

రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిని కలిసిన ములుగు నాయకులు

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో సభ్యులు శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంప నాగేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు ఆయనకు మొక్కను అందజేశారు. ములుగు జిల్లా రైస్‌మిల్లర్లకు సహాయ సహకారాలు అందించాలని వారు నాగేందర్‌ను కోరారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పల్లెపాటి సమ్మిరెడ్డి, జనరల్ సెక్రటరీ సహోదర్‌రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్, ఉపాధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, అక్కల రఘోత్తం, సంయుక్త కార్యదర్శి డేగల భద్రయ్య, సభ్యులు శ్రవణ్‌కుమార్, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

కాటారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడిపిలవంచ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ప్రజల కోరిక మేరకు ఒడిపిలవంచ నుంచి గూడూరు వరకు రోడ్డు నిర్మాణం కోసం సీఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కోడి రవికుమార్, మూల నరోత్తంరెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖల అధ్యక్షులు దావు భగవాన్‌రెడ్డి, సిరోజ్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు ఎలవేన రాజేందర్, నాయకులు కర్రు నారాయణ, పుల్లారెడ్డి, కొత్త మూర్తి, రమేష్, స్వామి, సదానందం, రామస్వామి, ప్రభాకర్, వెంకటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలి : సీపీఎం

గోవిందరావుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా ఇంది రమ్మ ఇళ్ల కమిటీలు ఏర్పాటు చేయాలని సీపీఎం గ్రామ కమిటీ నాయకుడు కడారి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పస్రాలో శని వారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీల వారీగా గ్రామసభలు నిర్వహించి ప్రజల సమక్షంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు ఏర్పాటు చేసి ఇళ్లులేని నిరుపేదలకు అందించాలన్నారు. పస్రా గ్రామంలో మంచినీటి కొరత తీవ్రంగా ఉందని, ఎర్రగుంట వద్ద బోరు మోటార్ చెడిపోయి రెండు నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి బోరు మోటార్‌ను ఏర్పాటు చేసి మంచినీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పల్లపు రాజు, మం చోజు బ్రహ్మచారి, సోమ మల్లారెడ్డి, క్యాతం సూర్యనారాయణ, గొర్ల శ్రీను, ఆదిరెడ్డి, రమేష్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, అరుణ్, కవిత, రాజేశ్వరి, సువర్ణ, అరవింద్, దేవరాజు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చుంచుపల్లిలో క్షయ నిర్ధారణ పరీక్షలు

మంగపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుంచుపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం క్షయ నిర్ధారణ పరీక్షలు పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో శనివారం జరిగాయి. 20 మంది నుంచి తెమెడా నమూనాలు సేకరించి పరీక్షించారు.

ఇద్దరు ట్రాన్స్‌కో లైన్‌మన్ల బదిలీ

కాటారం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):ట్రాన్స్‌కో కాటారం, చింతకాని లైన్‌మన్లు శ్రీనివాస్, బాలాజీ మండలం నుంచి భూపాలపల్లి టౌన్, టేకుమట్ల మండలం రామకిష్టాపూర్‌కు బదిలీపై వెళ్లారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ట్రాన్స్ ఫర్ కాగా వీరి స్థానంలో భూపాలపల్లి టౌన్ నుంచి చంద్రమౌళి, తిరుపతి మం డలానికి వచ్చారని ఆశాఖ అధికారులు తెలిపారు. కొన్నేళ్లుగా సక్రమంగా విధులు నిర్వర్తించిన లైన్‌మన్లకు పలువురు రైతులు, ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు.

గ్లోబల్ హ్యాండ్ వాష్‌పై అవగాహన

తాడ్వాయి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వస్త్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా మండల కేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్‌లోని విద్యార్థులకు కార్పెడ్ సంస్థ ప్రతినిధి ఎమ్డీ.షఫీ శనివారం అవగాహన కల్పించారు. చేతులు ఎప్పుడెప్పుడు కడగాలి, కడిగే విధానం, శుభ్రత గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఎంఈవో కేశవరావు చేతుల మీదుగా విద్యార్థులకు సబ్బులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మయ్య, వసంతరావు, రజిత, వసంత, చంద్రారెడ్డి, రేణుక, సీఆర్పీ రవికుమార్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

కాటారం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకాని, శంకరంపల్లి, దామెరకుంట ధన్వాడ, కాటారం, గారెపల్లి తదితర గ్రామాల పరిధిలో ఆవు, గేదె జాతి పశువులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం నాటికి మండలంలో సుమారు 1,800కు పైగా పశువులకు టీకాలు వేసినట్లు వెటర్నరీ వైద్యులు ధీరజ్, రమేష్, వంశీ తెలిపారు. రైతులు, పశువుల పెంపకందారులు ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో వెటర్నరీ అసిస్టెంట్లు, సిబ్బంది రాజేశేఖర్, అక్రం తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి : ఏఐవైఎఫ్

కాకతీయఖని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐవైఎఫ్ భూపా లపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని రావినారాయణరెడ్డి భవన్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ, బీఈడీ తదితర కోర్సుల బోధన, బోధనేతర బకాయిలు సుమా రు రూ.7,700 కోట్లు ఉన్నాయన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమిస్తేనే విద్యా రంగ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయ కులు ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, రమేష్, భగత్, తిరుపతి, మహేందర్ పాల్గొన్నారు.

ముగిసిన డీపీఎల్-9 క్రికెట్ టోర్నీ


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, నిర్వాహకులు

కాటారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ గ్రామంలో నిర్వహించిన ధన్వాడ ప్రీమియర్ లీగ్ తొమ్మిదో సీజన్ క్రికెట్ టోర్నీ ముగిసింది. 15 రోజులుగా నిర్వహిస్తున్న టోర్నీలో మహి-333, సాన్వి-11 జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. మహి-333 జట్టు విజేతగా నిలిచింది. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు సూచనల మేరకు కాంగ్రెస్ నేతలు, నిర్వాహకులు విజేత జట్లకు శనివారం బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ సర్పంచులు నవీన్‌రావు, అంగజాల అశోక్, నరేష్, నాయకులు కామిడి వెంకట్‌రెడ్డి, బోడ నరేష్, శ్రీకాంత్‌నాయక్, కాటారపు రాకేష్, మంత్రి నరేష్, శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెట్టింపు సౌందర్యం



గణపురం మండలంలోని కోటగుళ్లకు శనివారం మరింత అందాలు సంతరించుకున్నాయి. సూర్యాస్తమయం సమయాన ఆకాశం ఎరుపుగా మారడంత కాకతీయుల చారిత్రక ఈ కట్టడ సౌందర్యం రెట్టింపు అయ్యింది. అరుణ వర్ణంలో గుళ్లపై నింగి దర్శనమివ్వడంతో శిలా సంపద మరింత కళకళలాడింది.

- ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి)

పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సూర్యచంద్రకళ

మంగపేట, అక్టోబరు, 19,(ఆంధ్రజ్యోతి), ములుగు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సూర్య చంద్రకళ హాజరయ్యారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మోటర్ వెహికల్ యాక్ట్, ఉచిత న్యాయ చట్టం, పోక్సో తదితర చట్టాల గురించి వివరించారు. సినీయిర్ సివిల్ జడి కన్నయ్యలాల్, ప్రిన్సిల్ జూనియర్ సివిల్ జడ్జి రామ మోహన్‌రెడ్డి, అడి షనల్ జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య, ఏటూరు నాగారం సీఐ శ్రీనివాస్, మంగపేట ఎస్సై సూరి, ఎంఈఓ మేనక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

ఏటీసీ స్థలానికి
హద్దుల ఏర్పాటు

కాటారం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాటారం రెవెన్యూ శివారు సర్వే నెంబర్ 49లో ఉన్న తిమ్మన్నకుంటలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) కోసం కేటాయించిన ఎకరం స్థలానికి శనివారం అధికారులు సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు సర్వేయర్ వినయ్‌తో హద్దులు నిర్ణయింపజేసి ఐటీఐ ప్రిన్సిపాల్ భిక్షపతికి అప్పగించారు. సర్వే సమ యంలో పలువురు ప్రజలు పలుమార్లు కొలిచి హద్దులు మార్చడం తగదని ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సఫీర్‌ఖాన్, రెవెన్యూ సిబ్బంది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులపై లాఠీచార్జి సిగ్గుచేటు : బీజేవైఎం

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 విద్యార్థుల పట్ల మొండిగా వ్యవహరిస్తూ న్యాయమైన డిమాండ్లను తీర్చలేని చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులపై లాఠీచార్జి చేయ డం సిగ్గుచేటని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి హరీష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువ తకు న్యాయం జరిగేవరకు బీజేవైఎం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల ప్రవర్తించే పద్ధతిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

వలంటీర్లు లేకనే ప్రమాదాలు!

- ఇసుక లారీలు సమయ పాలన పాటించడంలో విఫలం

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : ఇసుక లారీల నియంత్రణకు టీజీఎండీసీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. లారీలు అతివేగం, సమయ పాలన పాటించకుండా వెళ్తుండ టంతో స్కూల్ బస్సులు, పాదాచారులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అంటున్నారు. గతంలో కాటారం సబ్‌డివిజన్ పరిధిలో టీజీఎండీసీ నియమించిన వలంటీర్లు పోలీస్ శాఖ అనుసంధానంతో సుమారు 40మంది పని చేయగా ప్రమాదాల సంఖ్య నియంత్రణలో ఉండేదని చెబుతున్నారు. వీరంతా ప్రధాన కూడళ్లు, చెక్‌పోస్టులు, జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తూ ఇసుక లారీలు సమయ పాలన పాటించేలా, వేగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకొనే వారని, ఇప్పుడు వారి సంఖ్య తగ్గడంతో నియంత్రణ గాడితప్పుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వెరసీ లారీ డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అజాగ్రత్తగా లారీలు నడుపుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక లారీల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని, ముందస్తు చర్యలు చేపట్టాలని పలువురు అంటున్నారు. లారీలు సమయ పాలన పాటించడంతో పాటు వేగాన్ని నియంత్రిచేలా డ్రైవర్లకు సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళా శక్తి పథకంపై అవగాహన

మంగపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంది రా మహిళాశక్తి పథకం ద్వారా పాడి గేదెలు, పెరటి కోళ్ల పెంపకంపై లబ్ధిదారులకు మండల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని గంపోని గూడెం రైతు వేదిక భవనంలో జరిగింది. పశు సమర్ధక శాఖ అధికారి వడ్డెపెల్లి రమేష్ పలు అం శాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అమల వుతున్న పాడి గేదెల సంరక్షణ గురించి పూర్తి మెల కువలు, టీకాలు, వ్యాధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా డీపీఎం లీలాకుమారి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా పాడి గేదెలు, పెరటికోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించొచ్చన్నారు. లబ్ధిదారులకు స్త్రీనిధి ద్వారా రుణాలను మంజూరు చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అప్పా రావు, సీసీలు డి.సత్యనారాయణ, సులోచన, మల్లేశ్వరి, శ్రీను, జనార్దన్, తార, మండల సమాఖ్య ప్రతినిధులు వట్టం కృష్ణవేణి, షేక్ నజ్మా, గ్రామ సమాఖ్య వీవోఏలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు ప్రారంభం

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 19: ములుగు మండ లంలోని బండారుపల్లి తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్‌లో శనివారం జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ ఎంపిక క్రీడలను ఎంఈవో సామల శ్రీనివాసులు ప్రారం భించారు. ఈసం దర్భంగా అండర్-17 వాలీబాల్ విభాగంలో బాలబాలికలు, అండర్-14 ఖోఖో విభాగంలో బాలికలు పాల్గొన్నారు. ఈవిభాగాల్లో ఎంపికైన క్రీడాకారులు ఆదివారం హనుమ కొండలోని జవహర్ లాల్‌నెహ్రూ స్టేడియంలో జరిగే ఎంపిక కార్యక్రమానికి హాజరుకావాలని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ బలుగూరి వేణు తెలిపారు. ఈ కార్యక్ర మంలో సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు రాజు, సాంబ య్య, గురుకులం ప్రిన్సిపాల్ అమృతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.